"ఛఫ్! సిగ్గులేక మళ్ళీ మాట్లాడుతున్నావే! దాన్ని చూస్తోంటి కత్తికట్టి కసితీరా పొడిచేద్దా మనిపిస్తోంది." ఇప్పుడు సరిగ్గా అతని కళ్ళు చూస్తే తెలుస్తుంది అతనిలోని క్రూరత్వమంతా.

"దానికి మిమ్మల్ని చూస్తోంటే అలాగే ఉండొచ్చునేమో?" నాకు వళ్ళు భగభగ మంటోంది.

"ఆ—దానితో చెబుతున్నా వినకుండా సినిమాలూ, షికార్లూ చేయడమే కాకుండా మళ్ళా మాట్లాడతావ్! నువ్వూ అలా ఎవడ్నో లేవ దీసుకుపోకూడదూ — శని విరగడవుతుంది." నాకు ఒక్క పెట్టున వాంతొచ్చినట్టయింది. ఛీ.ఛీ ఏం మనిషి, ఏమిమాటలు, నేనూ అంతకన్నా పెద్దమాటే అనొచ్చు. కాని నిగ్రహించుకున్నాను తగ్గుతారేమోనని కాని—

"ఊరూ పేరూ లేనివాణ్ణికట్టుకొచ్చి కులుకు తున్న దానితో...."

"అది కట్టుకునొచ్చున్నా కులుకుతోంది. మనం కట్టుకునే దొకర్ని, కులికే దొకరితో."

"నోరుముయ్!"

"ముందు అలివేణి నోరు మూయించండి." చెంప చెళ్ళుమంది.

కథానిక:

# ఏడిపించిన సుహాసిని

*వడ్లపట్ల దయానందం*

"ఒక కుక్కకి హఠాత్తుగా మాటలొచ్చాయట. అది నరమానవుల వెంటబడుతూ; నా కంటే మీరు దేనిలో ఉత్తములు అని అడగటం మొదలు పెట్టిందట."

"ఏడ్చావంట .... నీ తెలివి తేటలంతకంటె అమోఘంగా ఏడ్చినట్టున్నాయంట .... అవును కానీ .... ఒరేవ్ .... ఇలా చూడు" అన్నాడు వెంకట్.

వాడి అసలు పేరు 'వెంకటప్పయ్య' 'టప్పయ్య' అన్నది 'దేవయ్య'లా బావుండ లేదని, ఒకమ్మాయిని ప్రేమించిన సందర్భంలో జూలియట్ సలహామీద నామ సంస్కరణ గావించుకున్నాడు.

ఏమిటోనని అలా చూశాను చిన్న పేపరు తుంపుని కళ్లతో నమిలి పారేస్తున్నాడు. వాడి సంభ్రమాశ్చర్యాలు చూచేసరికి విస్తుపోక తప్పిందిగాదు. ఎందుకంటె వాడిలో పరిచయ మేర్పడి ఈ ఆరుసంవత్సరాల్లో వాడాశ్చర్యపడ్డ సందర్భాలు బహుఅరుదు.

"అతి పురాతన ప్రేమలేఖ ఒక ఈజిప్టు రాకుమారికి, మరొక రాకుమారుడిచేత ఇటుక మీద వ్రాయబడి పంపబడిందట ప్రేమ లేఖలు వ్రాయడంలో జ్యూలియట్లదేపై చేయుట. ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామ సమయంలో దూర ప్రాచ్యంలో ఉన్న ఒక బ్రిటిష్ సైనికు డికి....అతగాడి ప్రియురాలు ఒక్క వారం రోజుల్లో అక్షరాలా నాలుగువందల ప్రేమలేఖలు ఏకధాటీగా వ్రాసేసిందట....

ఎలిజిబెత్‌రాణి ఆస్థానంలో ఒక యువకుడు ఒక అమ్మాయిని తొలి చూపులోనే ప్రేమించి పారేసి....మలిచూపులో నిమిత్తం లేకుండానే మూడువందల తొంభైవనిమిది పేజీలు ప్రేమ లేఖ వ్రాశాట్ట....దానిలో పదాల్ని లెక్కపెట్టగా నాలుగులక్షల పదివేలని తేలిందట. ప్రపంచ చరిత్రలో ప్రజాస్వామిక దేశాల్లో ఏ ప్రతిపక్షం చేత సైతం ఇన్ని పదాలుగల తీర్మానం ఎప్పుడూ చేయబడలేదట.

సంవత్సరంక్రితం పై ఉదంతాలను తెలుసు కున్నప్పుడుమట్టుకు రవ్వంత ఆశ్చర్యపోయి "అబ్బో అయితే అతి ప్రాచీనమైన ప్రేమలేఖ తాలూకూ ఆ ఇటుకని అతి నిడివిగల ప్రేమ లేఖ అసలు లిఖిత ప్రతిని ఏ మ్యూజియమ్ లోనూ భద్రపరచలేదా" అని అడిగాడంతే.

ఇహ....

"ఈ భూగోళాన్ని గోళీకాయలా పట్టేసి అలా అనంతరంలోకి అవలీలగా విసిరిపారేయగల ఉద్ధండుడెవడో ఎక్కడో పుట్టుకొచ్చాడట" అంటే, అహా....అలాగా అనేస్తాడు. సర్వసామాన్యమైన విషయంలా....

"ఫలాన దేశ ప్రధానమంత్రి చలో క్తి ఏదో విసిరాడట." "మనం విసురుకోమేమిటీ లక్షా తొంభై" తేలిగ్గా అనేస్తాడు ఇది సైతం సర్వ సామాన్యమైన విషయమే నన్నట్టు.

అట్టివాణ్ణి అంతగా ఆశ్చర్యపరుస్తూ .... సంతోషపెడుతున్న ఆ పేపరు తుంపులోని మహత్తర విషయరాజం ఏమిటా? ఆత్రుత నాకూ హెచ్చింది. బహుశా—"కనీసం గ్రాడ్యుయేటు..నిరుద్యోగి..రూపమంతుడు సంప్రదాయ కుటుంబీకుడూ అయిన ఇరవైఐదు సంవత్సరాల యువకుడు-ఓ చక్కని ముప్ఫయి సంవత్సరాల చుక్కకి వరుడుగా కావలెను....వివరాలకు సో అండ్ సో" అని ఏదైనా ప్రకటన ఏమో అనుకున్నా.

అదైనా వాణ్ణంత ఆశ్చర్యపరచడానికిగాని, సంతోషపెట్టడానికిగాని .... వీల్లేదు .... ఎందుకంటే....వాడి "మారని ప్రేమ" తాలూకు శాశ్వత ప్రేయసి ఒకర్తె ఉన్నది. అందంగా ఉంటే .... వినడానికి అంతకంటే సొంపుగా మాట్లాడుతుందట. ఆ అమ్మాయిని వీడు సంవత్సరం క్రితమే ఓ శుభముహూర్తాన ఒకానొక నడిరోడ్డుమీద పట్టపగలు ప్రేమించాడు. ఆ దరిమిలాను ఆ అమ్మాయి వీడి ప్రేమను భద్రంగా పుచ్చుకుంది. చిన్న ప్రేమలేఖ ద్వారా తిరిగి ఇచ్చింది. అంతే ఆ దెబ్బతో వీడి హృదయంలోని ప్రేమ నలుసు రాజుకుని హృదయంలోని అన్ని ప్రాంతాలకీ పాకిపోయింది. కనకనే అట్టి ప్రకటనలతో వీడికంతగా 'ఇది' ఉంటానికి వీలులేదు. పోతే....

"నేటి భిక్షాధికారులు....రేపటి లక్షాధికారులెందుక్కాగూడదు? .... వివరాలకు ఫలానా విలువగల స్టాంపులు పంపుతూ—ఈ క్రింది ఎడ్రస్‌కి ఉత్తరం వ్రాయండి. త్వరపడండి" అంటున్నాడా ఎవడైనా....

బహుశా అదేదో అలాంటి ప్రకటనే ఉంటుందనుకున్నా.

అంతలోనే సంతోషంతో వాడు అంతయిపోయి ఇంతెత్తున లేస్తూ.

"ఒరేవ్....వచ్చే సంవత్సరం ఈపాటికి మనం లక్షాధికారులం ఎందుక్కాగూడదూ" గట్టిగా అరచాడు. ఆ పేపరుతుంపుని అంతకంటే గట్టిగా హృదయాని హత్తుకుంటూ....

వాడికి స్వశక్తిమీద కష్టపడి సంపాదించడంలో బొత్తిగా నమ్మకంలేదు. కష్టపడి సంపాదించి గొప్పవాళ్ళైనవాళ్ళు ఈ ప్రపంచకంలో బహుఅరుదు అన్నదది వాడి స్థిరవిశ్వాసం. అలాఅని దారేపోతుంటే ఎక్కడైనా దొరుకుతుందనికాదు....ఏదోఒక లాబూటకంగా సంపాదించటానికి చక్కని మార్గాన్ని అన్వేషించాలని వాడి అభిలాష.

"అవునవును లక్షాధి కారులం ఎందుక్కాగూడదు....మనమే బద్ధకించి ఊరుకుంటున్నాం కాని—ఒరే వెంకటప్పయ్యా ఎందుకూ పనికిరాని వెధవ తెలివితేటలూ మనమూనయ్యె....ఇక మనకి సాధ్యంకాని దంటూ ఏముంది"—

"ఉందిరా....ఉంది....ఆ 'సుహాసిని' (వాడి ప్రేమకథనంలోని జూలియట్) పితృమూర్తి కఠిన హృదయాన్ని గెలవడం...." బాధగా మూలిగి ఆ పేపర్‌కట్‌ని జార విడిచేశాడు.

దాన్ని కాస్తా చేజిక్కించుకుని చూస్తిని గదా .... ఆశ్చర్యం .... కోతిమార్కు (మంకీ బ్రాండ్) నల్ల పండ్లపొడి ఎడ్వర్‌టైజ్‌మెంటు.

ప్రేమజ్వరంలో వీడిమతికాస్తా చలించలేదు కదా....అని పరీక్షించవలసిన అవసరం ఏర్పడక తప్పలేదు.

మూడువ్రేళ్లు పైకిచూపిస్తూ "ఇవెన్నిరా? అనడిగా. ఇప్పుడు మనం కూర్చున్నది రూమ్‌లోనే కదూ ?"

వాడంత బాధలోనూ పక్కున నవ్వేసి—"ఏవిత్రా వెధవప్రశ్నలూ నువ్వూను. మూడు వ్రేళ్ళు....మనం కూర్చున్నది ఏటివొడ్డు ఇసుక తిన్నేనూ"—

ఏటిఒడ్డున ఇసుకతిన్నెలో కూర్చునున్నాం. సాయంసంధ్యంటే చెవి కోసుకుంటాడు. బల వంతాన అలా ఊరి బయటికి....బడ బడ లాక్కొచ్చేస్తా డంతే. దానిక్కారణం లేక పోలేదు.

"మరట...సుహాసిని కూడానట. ఈసంధ్యా సమయం అంటే పెరపెర లాడిపోతుందట.... అందుకనేమో....ఈ సంధ్యా సమయంలో ఆ సుహాసినిని తలచు కుంటూంటేనట.... మరట....వీడి మనసట....ఆదోలా ఇదైపోతుం దట" ఈ రహస్యం నావొక్కడికీ చెప్పాడు.

ప్రేమజ్వరపీడిత....విరహబాధిత....కల్లోల హృదయ వెంకటప్పయ్య....ఇసుకలో పడి దొర్లుతున్నాడు. వాడలా నడుంవిరిగినపాములా మెలికలు తిరిగిపోతూంటే ఎంతైనా జాలేసింది. అప్పుడప్పుడూ బాధగా తనలోతను గొనుక్కుం టున్నాడు.

"ఒక్క యాభైవేలు....వెధవయాభైవేలు.. ముష్టియాభై....మనం సంపాదించలేమూ?"

వాడికీ మధ్య డబ్బుపిచ్చి మహా ఘోరంగా పట్టింది....దానిక్కారణం....వాడి మారని ప్రేమతాలూకూ జబ్బే.

వెనకటికి ఒకనాడు వాడి హృదయరాణి అన్నదట:—"నువ్వెలానూ నా హృదయాన్ని ఆక్రమం చేసుకున్నావ్ .... వెంకట్ .... ఇక గెలవవలసిందల్లా నా తండ్రిగారి హృదయాన్నే. అందుకు ప్రయత్నించు" అనేసి....తండ్రిదగ్గ రకి వీణ్ణితోలేసిందట.

"కాలేజీలో చదువుతున్న చిన్నదానివి.... ఆనవాయితీ తప్పించి....మళ్ళా తండ్రిహృద యాలుగట్రా అని అడ్డుపెట్టబోకు—నువ్వే సాహసించి ముందడుగేసేయ్"—అన్నాట్ట.

"లాభంలేదులే డియర్ వెంకూ....ఆ పంథా బొత్తిగా లాభంలేదు....నువ్వు నాన్నని కలిసి ఒప్పించాల్సిందే"—నని ఖచ్చితంగా చెప్పే సిందట.

మనవాడిహ చచ్చినట్టూ సుహాసిని తండ్రిని కలవక తప్పలేదు. వీడక్కడికి సగం చచ్చిపోయే వెళ్ళాట్ట....అవును మరి....నోరు తెరచి....అభిమానం చంపుకుని....పిల్ల నివ్వ మని అడగటమయ్యె.

ఆమట్న వీడు వెళ్ళడంతోనే, ఎగాదిగా చూచేసి....ఆయనన్నాడట....

"మెడమీదవరకు ఆ గిరిజా లేమిటోయ్ రాజకుమారుడి వేషంలా .... ఆ కళ్ళజోడు పోక్కి పెట్టుకుందా .... ఏమైనా కళ్ళజబ్బు కూడానా?"

ఏడ్వలేక నవ్వేసి ఊరుకున్నాట్ట వీడు. అమాంతం సుహాసినిమీద ప్రేమని ఉప సంహరించి చేసుకోవాలన్నంత కోపం కూడా వచ్చేసిందంట....కాని అది అసాధ్యంగా కని పించి....అభిమానం పూర్తిగా చచ్చిపోయి.... ఏదో అలా కూర్చుండిపోయాడంట ఆయన కెదురుగా.

"అయితే ఏమోయ్....స్థిరం చరం ఏమాత్ర మున్నాయ్.... పెళ్ళిళ్ళు కావలసిన చెల్లెళ్లు ఎవ రైనా ఉన్నారా....ఆస్తి పంచుకోవలసిన భాగ స్వాములెందరు?" ఏవో దస్తావేజులు చూచు కుంటూ అడిగాట్ట ఆయన.

వీడు వెంటనే భళ్ళున నవ్వేసి....

"అబ్బెబ్బే ఆ బాదరబందీ వ్యవహారం ఏంలేదు లెండి....స్థిరం పూజ్యం.... రవ్వంత ఉన్నా ఋణానికి సరిపోతుందిలెండి. ఆబాధేం లేదు....ఇక చరం అంటారా....రెండు పాత ట్రంకుపెట్టెలూ, రెండు లెదరు బ్యాగులూ. ఒక రోజ్‌వుడ్ రూళ్ళకర్రా నండి"—అన్నాట్ట.

ఆయన వెంటనేలేచి లోనికెళ్ళి అమ్మాయికి గట్టిగా చివాట్లుపెట్టి బయటికొచ్చి—నెమ్మదిగా అన్నాట్ట....

"ఇదిగో చూడూ....ఈ కాలంలో డిగ్రీ లెవరిక్కావాలోయ్....నాదంతా నిక్కచ్చి వ్యవ హారం....అమ్మాయిని గట్టిగా వలచానంటు న్నావ్ కనుక....చెబుతున్నా....కనీసం ఒక యాభైవేలన్నా కూడబెట్టి మళ్ళా నాక్కనిపించు కట్నంపేరిట నేనొక పదివేలు ముట్టజెప్పతాను, ఇక వెళ్ళిరా" అన్నాట్ట....పైపెచ్చు సరిగ్గా పద్దెనిమిది మాసాలు టైంకూడా పెట్టాట్ట....ఈ కండిషన్‌కి లిమిటేషన్ పట్టకుండా సరిగ్గా ఆ

(తరువాయి 48వ పేజీలో)